

13న జిల్లాకు లంకా దినకర్ రాక

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇరవై సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఈ నెల 13న జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కలెక్టరేట్‌లో 13న ఉదయం 10.30 గంటలకు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. ఉపాధిహామీ పథకం, పీఎం గ్రామ సడక్ యోజన, జల్ జీవన్ మిషన్, అమృత్, సూర్యఘర్ వంటి కేంద్ర పథకాల అమలు, పురోగతిపై ప్రధానంగా సమీక్షిస్తార'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు.



● మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల పాఠశాలలో సుమారు 377 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి గది కిటికీలు పూర్తిగా పాడయ్యాయి. వాటికి మెస్‌లు లేకపోవడంతో దోమలు లోపలకు వచ్చేస్తున్నాయి. విద్యార్థులు రాత్రి సమయంలో కిటికీలకు దుప్పట్లు కట్టి దోమల నుంచి రక్షణ పొందుతున్నారు. అలాగే పెద్దమడి గురుకుల కళాశాలలో 185 మంది విద్యార్థులు ఉండగా వారు నిద్రపోవడానికి సరిపడా గదులు లేవు. ఒకే గదిలో వంద మంది వరకు పడుకుంటున్నారు. మరికొంత మంది తరగతి గదులకు వెళ్లి నిద్రపోవాల్సి వస్తోంది.



● మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలో 115 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో భోజనం గది లేక వరండాల్లో విద్యార్థులు తింటున్నారు. వంటశాల లేక ఆరుబయట వంటలు చేయాల్సి వస్తోంది.

పర్యవేక్షణ ఉంటే ఒట్టు!

● గిరిజన విద్యాలయాల్లో సమస్యలు

● హాస్టళ్ల కిటికీలకు కానరాని మెస్‌లు ● లోపలకు వచ్చేస్తున్న దోమలు

● సక్రమంగా అమలుకాని మెనూ ● విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

మెళియాపుట్టి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):

గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు వెంటాడుతున్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 29 ఆశ్రమ పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలు, 18 మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో 16,686 మంది విద్యార్థులు ఉన్నారు. చాలా వసతిగృహాల్లో సమస్యలు వేధిస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. రక్షణ గోడలు లేవు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమలు లోపలకు వచ్చేస్తున్నాయి. దీంతో విద్యార్థులకు కంటి నిండా కునుకు కరువవుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీ కెమెరాల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో చాలా వరకు మూలకు చేరాయి. వార్డెన్లు పూర్తిస్థాయిలో లేరు. ఒక్కొక్కరూ రెండు, మూడు వసతి గృహాల బాధ్యతలు చూస్తున్నారు. దీంతో ఏ హాస్టల్‌పై కూడా సరైన దృష్టి పెట్టలేకపోతున్నారు. మెనూ సక్రమంగా అమలు చేయకపోయినా అడిగే నాథుడు కనిపించడం లేదు. ఇటీవల ఓ ఆశ్రమ పాఠశాలలో సిబ్బంది మధ్య తగాదాలు జరిగాయి. ఈ పంచాయితీ సీతంపేట పీవో వద్దకు చేరింది. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతమంది అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

● అంతా ఇష్టారాజ్యం..

వైసీపీ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా జిల్లా పునర్విభజన చేసింది. పాలకొండ నియోజకవర్గం పరిధిలో ఉన్న సీతంపేట ఐటీడీఏను పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించింది. దీంతో పీవో పార్వతీపురం మన్యం జిల్లాకే పరిమితం కాగా.. ఇక్కడ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. గతంలో మండలస్థాయి అధికారులు ప్రతి నెల కొన్ని ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి అక్కడి సమస్యలపై పీవోకు నివేదిక ఇచ్చేవారు. గత రెండేళ్ల నుంచి ఎటువంటి తనిఖీలు జరగడం లేదు. సీతంపేట, మెళియాపుట్టిలో ఏటీడబ్ల్యూవో పోస్టులు ఖాళీగా ఉండడంతో గిరిజన పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఇన్‌చార్జిలను నియమించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. అలాగే జిల్లా విభజన తరువాత సీతంపేట ఐటీడీఏకు చెందిన అధికారులంతా పార్వతీపురం మన్యం జిల్లాలో ఎక్కువగా ఉంటున్నారు. దీంతో ఇక్కడి వసతి గృహాలు, పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది. వార్డెన్లు ఇష్టారాజ్యంగా (మిగతా 4వ పేజీలో..)

విద్యుత్ కనెక్షన్‌కు నూతన విధానం: ఎస్ఈ

పాత శ్రీకాకుళం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు పారదర్శకంగా సత్వర సేవలు అందించేందుకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నూతన విద్యుత్ కనెక్షన్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు సూపరింటెండెంట్ ఇంజనీరు నాగిరెడ్డి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఈజ్ ఆఫ్ లివింగ్' కార్యక్రమంతో ఈ విధానం అమలులోకి తెచ్చాయి. వినియోగదారులు కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా, ఎస్టిమేట్ కోసం ఎదురు చూడకుండా, క్షేత్ర పరిశీలన లేకుండానే సత్వరంగా సర్వీసులు జారీ చేస్తాం. గృహ వినియోగదారులకు మొదటి 1 కిలోవాట్‌కు రూ.1500, వాణిజ్య వినియోగదారులకు రూ.1800, ప్రతి అదనపు కిలోవాట్‌కు రూ.2000 చార్జీలుగా నిర్ణయించాం. 20 కిలోవాట్లకు రూ.12,600, హెచ్‌టీ 75-150 కిలోవాట్లకు రూ.4,400 చొప్పున చార్జీలు వసూలు చేస్తాం. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1912 సంప్రదించాల'ని ఎస్ఈ తెలిపారు.

రేపు జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 8న జిలాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా తెలిపారు. '18 ఏళ్లు నిండిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. గతంలో ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ప్రాధాన్యమిస్తాం. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు శిక్షకుడు జోగిపాటి వంశీని(ఫోన్ నెంబర్ 7660874844) సంప్రదించాలి. ఇందులో ఎంపికైనవారు విజయవాడలో ఈనెల 11న జరగనున్న రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటార'ని రాజా తెలిపారు.

పలాసలో వ్యాపారి కిడ్నాప్

● వీఎల్ఎన్ రాజును కారులో ఎత్తుకెళ్లిన దుండగులు

● షాపింగ్ కాంప్లెక్స్‌ను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు యత్నం

● పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విడిచిపెట్టిన వైనం



వీఎల్ఎన్ రాజు(ఫైల్)

పలాస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పలాసలో కిడ్నాప్ కలకలం రేగింది. గురువారం ఉదయం టీ తాగుతున్న ఓ వ్యాపారిని కారులో కొంతమంది వ్యక్తులు వచ్చి కిడ్నాప్ చేయడంతో తోటి వ్యాపారులంతా ఆందోళన చెందారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగారు. వ్యాపారికి ఆమదాలవలసలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసేందుకుగాను కిడ్నాప్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. కిడ్నాపర్లను హెచ్చరించడంతో వారు వ్యాపారిని విడిచిపెట్టేశారు. ఈ ఘటనకు సంబంధించి కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పలాసకు చెందిన ప్రముఖ జీడి వ్యాపారి, బ్యాంకుల కన్సల్‌టెంట్ వి.లక్ష్మీనారాయణరాజు (వీఎల్ఎన్ రాజు)ను ఆమదాలవలసకు చెందిన వ్యాపారి పొట్నూరు వేణుగోపాలరావు, ఆయన అనుచరులు గురువారం ఉదయం కిడ్నాప్ చేశారు. రాజు గురువారం ఉదయం 9 గంటల సమయంలో కేటీ రోడ్డు, విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద టీ తాగుతున్నారు. ఈక్రమంలో ఆమదాలవసలకు చెందిన శ్రీను అనే వ్యక్తి వీఎల్ఎన్ రాజును బయటకు రావాలని పిలిచాడు. అప్పటికే రోడ్డుపై రెండు కార్లతో పొట్నూరు వేణుగోపాలరావుతో పాటు ఏడుగురు వ్యక్తులు రెడీగా ఉన్నారు. వీఎల్ఎన్.రాజు బయటకు రాగానే బలవంతంగా ఆయన్ను కారులోకి ఎక్కించి కిడ్నాప్ చేశారు. రాజు వద్ద ఉన్న సెల్ ఫోన్ తీసుకొని స్విచ్ఛాప్ చేశారు. రాజుతో పాటు టీ తాగేందుకు వచ్చిన ఆయన స్నేహితులు ఏమి జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు. అనంతరం ఆయన భార్య మాధవికి ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. వెంటనే రాజుకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో మాధవి ఆందోళన చెందారు. మాధవితోపాటు పలాసకు చెందిన కొంతమంది వ్యాపారులు కాశీబుగ్గ పోలీసులకు కిడ్నాప్ వ్యవహారాన్ని తెలిపారు. ఆమదాలవలసలో షాపింగ్ కాంప్లెక్స్ విషయమై కిడ్నాప్ జరిగినట్టు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా రాజు ఫోన్‌కు రింగ్ చేసినా స్పందన లేకపోయింది. ప్రమాదం పొంచి ఉందని భావించిన కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ ఆమదాలవలస పోలీసులకు సమాచారం అందించారు.

● షాపింగ్ కాంప్లెక్స్ రిజిస్ట్రేషన్ కోసమే..

వీఎల్ఎన్ రాజుకు ఆమదాలవలసలో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. దీన్ని కొన్నాళ్ల కిందట వేణుకు అద్దెకు ఇచ్చారు. ఇప్పటికే వేణు వద్ద రూ.1.10 కోట్లు అప్పు రూపంలో రాజు తీసుకున్నారు. దీన్ని మార్టిగేజ్ చేస్తూ 2029 వరకూ టైమ్‌బాండ్ పెట్టుకున్నారు. ఆస్తిని విక్రయించి వేణుగోపాలరావుకు అప్పు డబ్బులు ఇవ్వడానికి రాజు సిద్ధమయ్యారు. పలాసకు చెందిన బ్రోకర్ల సహాయంతో ఆ ఆస్తిని వేరొకరికి అమ్మడానికి ప్రయత్నించారు. కాగా ఈ ఆస్తిని తనకు తప్ప వేరే వ్యక్తులకు అమ్మకూడదని, అలా చేస్తే ఊరుకోనని వేణు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిరోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇటీవల వేణుగోపాలరావు అనుచరుడు శ్రీను కూడా రాజుకు హెచ్చరికలు జారీ చేశాడు. ఈ క్రమంలో రాజును కిడ్నాప్ చేసి బలవంతంగా ఆమదాలవలస సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలించారు. అక్కడ షాపులను రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రణాళిక రచించారు. కాగా.. రాజు కిడ్నాప్ విషయమై ఆయన భార్య (మిగతా 4వ పేజీలో..)

నరసన్నపేటలో విడిచిపెట్టి..

పోలీసుల హెచ్చరికతో వీఎల్ఎన్.రాజును నరసన్నపేట వద్ద విడిచిపెట్టి వేణుగోపాలరావు, ఆయన అనుచరులు వెళ్లిపోయారు. అతికష్టంపై అక్కడ నుంచి నేరుగా కాశీబుగ్గ పోలీస్టేషన్‌కు చేరుకొని కిడ్నాప్, రిజిస్ట్రేషన్ వ్యవహారాన్ని వీఎల్ఎన్ రాజు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై భౌతికంగా దాడి కూడా చేశారని ఏకరవు పెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. పట్టపగలు టీ తాగుతున్న సమయంలో రాజు కిడ్నాప్‌నకు గురికావడంతో తోటి వ్యాపారులంతా ఆందోళన చెందారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని వ్యాపారులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జల్‌జీవన్ పనుల పర్యవేక్షణకు గ్రామ కమిటీల ఏర్పాటు

● నీటి నాణ్యత కిట్లు కొనుగోలు చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పనుల వేగవంతానికి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డిప్యూటీ ఎంపీడీవోలను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ "ప్రతీ గ్రామంలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలో 15 మంది సభ్యులు ఉండాలి. అందులో సగం మంది మహిళలు తప్పనిసరి. సర్పంచ్ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జేజేఎంకు సంబంధించిన అన్ని పనులు ఈ కమిటీ తీర్మానం ద్వారానే జరగాలి. 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించే ప్రక్రియ వేగవంతం చేయాలి. డిక్లరేషన్‌కు సంబంధించి ఒక్క నిమిషం నిడివి గల వీడియోను రికార్డు చేయాలి. నీటి నాణ్యతను పరీక్షించడానికి అవసరమైన కిట్‌లను వెంటనే కొనుగోలు చేయాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డీపీఓ భారతీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి
● సీఎం చంద్రబాబు ఆదేశం 4లో

అవగాహనతోనే క్యాన్సర్ దూరం 4లో
● సకాలంలో చికిత్స అందితేనే నివారణ
● అందుబాటులో చికిత్స, వైద్య పరీక్షలు
● నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

జూదానికి దూరంగా ఉండండి
● డీఎస్పీ వివేకానంద 4లో

అంతా మా ఇష్టం 6లో
● రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపి వ్యాపారులు లోడింగ్, అన్‌లోడింగ్
● రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
● నరసన్నపేటలో ట్రాఫిక్ ఇబ్బందులు

పలాస.. నిరాశ

● కొత్త జిల్లా ఏర్పాటు లేనట్లేనా? ● ఆశలు వదులుకున్న ఉద్దానం వాసులు



పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు

పలాస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లా ఏర్పాటు విషయంలో పలాస నియోజకవర్గంతోపాటు చుట్టుపక్కల ప్రాంతవాసులకు నిరాశే మిగిలింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తారనే ప్రచారం సాగింది. ఇందులో పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలు చేరబోతున్నాయని తెలియడంతో ఉద్దానం ప్రాంతవాసులు ఎంతో సంబరపడ్డారు. ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు దిశగా అడుగులు వేయడంతో ప్రజాప్రతినిధులు కూడా అందులో పలాసకు చోటు దక్కుతుందని భావించారు. కానీ అటు ప్రజలు, ఇటు ప్రజాప్రతినిధుల ఆశలన్నీ నీరుగారాయి. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సచివాలయంలో రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన భేటీ అయింది. కొత్త జిల్లాలు, కొత్త రెవిన్యూ డివిజన్లు, రెవిన్యూ డివిజన్లలో చేర్పులు-మార్పుల వ్యవహారంపై చర్చించింది. చివరకు మదనపల్లె, మర్కాపురం కొత్త జిల్లాలతోపాటు, నక్కపల్లి, అద్దంకి, మడకశిర, బనగానపల్లె, పీలేరు, అవనిగడ్డ, గిద్దలూరు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులో పలాస ప్రస్తావన లేకపోవడంతో ఉద్దానం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● పలాస.. జీడి వ్యాపార పారిశ్రామికవాడగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. దేశంలో నాణ్యమైన జీడి ఎగుమతులకు నిలయంగా గుర్తింపు ఉంది. పలాసను జిల్లాగా ఏర్పాటు చేస్తే ఉద్దానం ప్రాంతం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆశించారు. ఈ ప్రాంతంలో ఒక భారీ పరిశ్రమ కూడా లేకపోవడంతో జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడతారని భావించారు. బాహుదా, మహేంద్రతనయ నదులు, వంశధార కాలువ, ఇచ్ఛాపురం నుంచి సంతబొమ్మాళి మండలం వరకూ 80 కిలోమీటర్ల పొడవునా సముద్రతీరం కలిగి ఉండడంతో పరిశ్రమలు పెట్టడానికి అనువైన ప్రాంతంగా ఇక్కడ సహజవనరులు పుష్కలంగా ఉన్నాయి. వరి, జీడి, కొబ్బరి, మామిడి, పనస, మునగ వంటి ప్రధాన పంటలతోపాటు సుదీర్ఘమైన అటవీప్రాంతం, జీవవైవిధ్యాన్ని పెంపొందించేలా తేలినీలాపురం, తేలుకుంచి పక్షుల విడిది కేంద్రాలు ఉద్దానం సొంతం. వాణిజ్య పంటల ద్వారా ప్రభుత్వానికి పూర్తిస్థాయి ఆదాయం కూడా లభిస్తోంది. ఇన్ని అనుకూలతలు ఉన్నా.. పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోవడం అన్యాయమని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పలాస జిల్లాగా రూపొందినట్లయితే ఉద్దానం-పలాస జిల్లా, ఎర్రన్నాయుడు పలాస జిల్లా, సర్దార్‌గౌతు లచ్చన్న పలాస జిల్లా అనే పేర్లు పెట్టడానికి నేతలు (మిగతా 4వ పేజీలో..)

పొల్లు గింజలే అధికం



జమ్ములో పొల్లు గింజలతో ఉన్న వరిపైరు చూపిస్తున్న అన్నదాత

● రైతులకు కలసిరాని ఖరీఫ్ సీజన్

● తుఫాన్ ప్రభావంతో తగ్గిన దిగుబడి ● నకిలీ విత్తనాలతో తప్పని అవస్థలు

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అన్నదాతలకు ఖరీఫ్ సీజన్ కలిసిరాలేదు. సీజన్ ఆరంభంలో విత్తనాలు, ఎరువుల కోసం ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వర్షాభార పరిస్థితులతో సాగునీటి కోసం అవస్థలు ఎదుర్కొన్నారు. చివరికి కోత దశకు వచ్చే సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో వేలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. దిగుబడి గణనీయంగా తగ్గింది. వరుస వర్షాలు కురవడం, గాలులు వీయడంతో చాలవరకు వరి గింజ కట్టలేదు. దీంతో పొలాల్లో పొల్లు గింజల(కవ్వలు)తో ఉన్న వరి కంకిలను చూస్తూ రైతులు కన్నీరు పెడుతున్నారు. అక్కడక్కడా కేళీలు ఉండగా, 20 నుంచి 30 శాతం వరకు పొల్లు గింజలు ఉన్నాయి. ఎకరాకు గతేడాది 30 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడి రాగా.. ఈ ఏడాది 20 బస్తాలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరిపైరు కోతకు ఎకరాకు రూ.5 వేలు, నూర్పులకు మరో రూ.8వేలు అదనంగా పెట్టుబడి పెరిగిందని వాపోతున్నారు.

● జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 3.80 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. సుమారు 8.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పుడిప్పుడే యంత్రాల ద్వారా ముమ్మరంగా నూర్పులు చేస్తున్నారు. ఎకరాకు సుమారు 35 బస్తాల ధాన్యం దిగుబడి రావాల్సి ఉండగా.. పొల్లు ఎక్కువగా ఉండడంతో 20 బస్తాల వరకే వస్తుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పాతపట్నం, సారవకోట, జలుమూరు, నరసన్నపేట, గార, శ్రీకాకళం రూరల్, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, ఇచ్ఛాపురం, మందస, మెళియాపుట్టి, పోలాకి తదితర మండలాల్లో పొల్లు గింజలు చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత ప్రయోగాలు నిర్వహించే గణాంకశాఖ అధికారుల జాడ ఈ ఏడాది కనిపించలేదు.

● నకిలీ విత్తనాలే కారణం..


జిల్లాలో కొంతమంది ప్రైవేటు డీలర్లు ఈ ఏడాది జూన్‌లో ప్రముఖ కంపెనీల లేబుళ్లతో కలిగిన విత్తనాలను విక్రయించారు. 20 కేజీల విత్తనాల బస్తాను రూ.1,400కు విక్రయించి దోపిడీకి పాల్పడ్డారు. మూడేళ్లగా స్వర్ణకు ప్రత్యామ్నాయంగా రైతులు 333, అమూల్య స్వర్ణ, సంపద స్వర్ణ, మార్టూరు స్వర్ణ, 1210 రకాల విత్తనాలు నాట్లు వేస్తున్నారు. చీడలు, తెగుళ్లకు తట్టుకుంటాయని ఈ రకాల విత్తనాలకు (మిగతా 4వ పేజీలో..)

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

- సకాలంలో చికిత్స అందితేనే నివారణ
- అందుబాటులో చికిత్స, వైద్య పరీక్షలు
- నేడు జాతీయ క్యాన్సర్ అవగాహన దినం

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి)

మారుతున్న ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మత్తుపదార్థాల వినియోగం, వంశపారంపర్య కారణాల వల్ల క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే రేడియేషన్, కిమోథెరపీ ద్వారా చాలావరకు నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కానీ వ్యాధి పట్ల సరైన అవగాహన లేకపోవడంతో ముదిరిపోయే వరకు రోగులు ఆసుపత్రులకు వెళ్లడంలేదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్యాన్సర్ పరీక్షలు, చికిత్స అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్‌తో బాధపడే వారు ఎక్కువగా వస్తున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా పాంక్రియాటిక్, ఊపిరితిత్తులు, కడుపు, ప్రొస్టేట్ క్యాన్సర్ల వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నారంటున్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా కథనం..



పాంక్రియాటిక్ క్యాన్సర్..

క్లోమగ్రంథి జీర్ణక్రియకు అవసరమైన ఎంజైములు, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ భాగంలో కణాలు అదుపుతప్పి పెరిగితే, పాంక్రియాటిక్ క్యాన్సర్‌గా మారుతుంది. ఇది అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్‌లో ఒకటి. ఎందుకంటే సాధారణంగా దీని లక్షణాలు చివరి దశలోనే బయటపడతాయి.

లక్షణాలు ఇవే..

కడుపు లేదా వెన్నుపూస వద్ద నిరంతర నొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం.. చర్మం, కళ్లలో పసుపు రంగు ఏర్పడడం (జాండీస్), వాంతులు, మలబద్ధకం, చక్కెర స్థాయిలు ఆకస్మాత్తుగా పెరగడం

● కారణాలు ఇవే..

ధూమపానం, మద్యపానం, అధిక కొవ్వు కలిగిన ఆహారం తీసుకోవడం, అధిక బరువు, కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉండడం

● వైద్యుల సలహా తప్పనిసరి..

పాంక్రియాటిక్ క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం కష్టమే కానీ ఎలాంటి లక్షణాలు కన్పించినా వైద్య నిపుణులను సంప్రదించాలి. ఎండోస్కోపీ, రక్త పరీక్షల ద్వారా ప్రారంభ దశలో చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ముదిరి ప్రాణాపాయం జరగకుండా నివారించవచ్చును.

ప్రొస్టేట్ క్యాన్సర్..

దీన్ని పౌరుష గ్రంధి అంటారు. ఇది పురుషుల్లో మూత్రాశయం కింద అక్రోట్ (వాల్ నట్) ఆకారంలో ఉండే ప్రొస్టేట్ గ్రంధిలో క్యాన్సర్ కణాలు పెరుగుతాయి. ఇది పురుషుల్లో అత్యంత సాధారణంగా వచ్చే క్యాన్సర్. ఇది 50 ఏళ్లు దాటిన పురుషుల్లో ఎక్కువగా ఉంటుంది. కుటుంబంలో ఎవరికైనా ప్రొస్టేట్ క్యాన్సర్ ఉంటే తక్కువ వయస్సులోనే 40 ఏళ్లలోపు మగవారిలో వచ్చే ప్రమాదం ఉంది.

● లక్షణాలు ఇవే..

రాత్రి పూట తరచుగా మూత్ర విసర్జన చేయడం, మూత్రధార సన్నగా రావడం, మూత్రం ఆపడంలో కష్టపడడం వంటి లక్షణాలు ఉంటాయి.

● జాగ్రత్తలు ఇవే..

50 ఏళ్లు దాటిన పురుషులు వైద్యుడ్ని సంప్రదించి ప్రొస్టేట్- స్పెసిసిక్ యాంటిజన్ రక్త పరీక్ష, అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రారంభ దశలో ఎటువంటి లక్షణాలు కన్పించినా వైద్యనిపుణులను సంప్రదించి చికిత్స చేసుకోవాలి. సరైన సమయంలో చికిత్స చేసుకోవడం ద్వారా ప్రొస్టేట్ క్యాన్సర్‌ను నిరోధించవచ్చును.



కడుపు క్యాన్సర్..

కడుపు క్యాన్సర్ సంబంధించిన కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. దీన్ని సైలెంట్ కిల్లర్ అంటారు. ఎందుకంటే చివరిదశ చేరేవరకూ ఈ లక్షణాలు బయటపడవు. అయితే సరైన సమయంలో గుర్తిస్తే చికిత్స సులభమౌతోంది.

● లక్షణాలు ఇవే..

ఆకలి కోల్పోవడం, అజీర్ణం, గ్యాస్, గుండెల్లో మంట, వికారం, వాంతులు, అప్పుడప్పుడు రక్తంతో కూడిన వాంతులు కావడం, పొత్తి కడుపు ప్రాంతంలో నొప్పి, రక్తహీనత, కొంచెం తిన్నా కడుపు నిండినట్లు అన్పించడం, నలుపురంగులో మలం రావడం వంటి లక్షణాలు కన్పిస్తే అశ్రద్ధ చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి.

● జాగ్రత్తలు తప్పనిసరి..

ధూమపానం, మద్యపానం ఆపివేయాలి. నూనెపదార్థాలు తగ్గించాలి. జీర్ణకోశ సమస్యలు దీర్ఘకాలికంగా వేధిస్తే వెంటనే ఎండోస్కోపీ చేయించుకోవాలి. మొదటి లేదా రెండు దశల్లోనే కడుపు క్యాన్సర్‌ని గుర్తిస్తే ఆధునిక చికిత్స విధానం ద్వారా పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంది.

నిర్లక్ష్యం చేయొద్దు



ముందుస్తుగా పరీక్షలను నిర్వహించడం ద్వారా 80శాతం వరకు క్యాన్సర్‌ను నివారించవచ్చు. తరుచుగా అజీర్ణంగా ఉండటం, కారణం లేకుండా బరువు తగ్గడం, కడుపు ఉబ్బరంగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయరాదు. ప్రాంకీయాసిస్ కడుపు క్యాన్సర్లు తొందరగా గుర్తిస్తే నివారించవచ్చు. 40 సంవత్సరాలు దాటిన తరువాత తప్పనిసరిగా ఏడాదికి ఒక్కమారు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలి. కుటుంబంలో గతంలో ఎవరికైనా క్యాన్సర్ సోకినట్లయితే అటువంటి వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలి.

-డా. గొండు గంగాధర్, గ్రాస్ట్రో ఎంట్రాలజిస్టు, శ్రీకాకుళం

ముందస్తుగా మేలుకుంటే మంచిది



పొగతాగేవారు, రసాయన పరిశ్రమల్లో పనిచేసే నేపథ్యం ఉన్న వారికి ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. ప్రాంకీయాసిస్ క్యాన్సర్ లక్షణాలు పైకి కనిపించవు. అందుకు ముందస్తుగా గుర్తించేందుకు అనేక రకాలు పరీక్షలు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. భయపడకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ముదరకుండా ముందస్తుగా మేలుకుంటు మంచిది.

-డా.పొన్నాడ గణేష్, సూపరింటెండెంట్, సామాజిక ఆసుపత్రి, కోటబొమ్మాళి

ఊపిరితిత్తుల క్యాన్సర్..

ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ధూమపానం వల్ల ఈ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. పొగ తాగేవారి పక్కన ఉండడం వల్ల కూడా ఈ రకం క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అలాగే వాయుకాలుష్యం కూడా వస్తుంది. కెమికల్ ఫ్యాక్టరీల్లో చేసే కార్మికులు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

● లక్షణాలు ఇవే..

మూడు వారాలు కంటే ఎక్కువగా వుండే దగ్గు ఉండడం. దగ్గినప్పుడు కఫంలో రక్తం పడడం, చిన్న పనిచేసినా శ్వాస ఆడకపోవడం, శ్వాస తీసుకున్నప్పుడు ఛాతీలో నొప్పి ఉండడం, అకారణంగా బరువు తగ్గడం వంటి లక్షణాలు ఏర్పడతాయి. ఈ లక్షణాలు ఏర్పడితే తక్షణమే పల్మనాలజిస్టులను సంప్రదించి చికిత్స చేసుకోవాలి.



పర్యవేక్షణ ఉంటే ఒట్టు!

(మూడో పేజీ తరువాయి)

వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల వార్డెన్ పోస్టుల కోసం తగాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. బోధన, మెనూ సక్రమంగా అమలుచేయకపోయినా విద్యార్థులు చెప్పుకోలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పలాస.. నిరాశ

(మూడో పేజీ తరువాయి)

ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే పలాస పేరే కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదనల్లో లేకపోవడంతో వారి ఆశల్లో నీళ్లు చల్లినట్లయింది. పాలనా సౌలభ్యం కోసం చేస్తున్న జిల్లా, డివిజన్ల పెంపు వ్యవహారంపై మరింత స్పష్టత కోసం మరోసారి సమావేశం అవుతామని ఉపసంఘం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పలాస, టెక్కలి డివిజన్‌లో ఉన్న ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ప్రభుత్వంపై పూర్తిస్థాయిలో ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పొల్లు గింజలే అధికం

(మూడో పేజీ తరువాయి)

ఈ ఏడాది డిమాండ్ బాగా పెరిగింది. దీంతో జిల్లాలో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలను ప్యాకింగ్ చేసి.. రూ.300 విలువ చేసే ధాన్యాన్ని రూ.1600 వరకు విక్రయించారు. నకిలీ విత్తనాల కారణంగానే కేళీలు ఎక్కువగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించినా వరి పొట్ట దశలో వర్షాలు కురిశాయి. కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించడంతో వరి పంట చేతికి అందిన సమయంలో పొల్లు గింజలే ఎక్కువగా ఉన్నాయి. కేళీలు తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు పూతికలు (నల్లని ధాన్యం) కూడా పంటలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

-యాళ్ల వేణుగోపాలరావు, రైతు, మాకివలస

పెట్టుబడికి సరిపోవడం లేదు..



ఈ ఏడాది ఎకరా వరిసాగుకు సుమారు రూ.30వేలు ఖర్చయింది. తుఫాన్ ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 20 నుంచి 22 బస్తాల ధాన్యం మాత్రమే పండాయి. పెట్టుబడికి కూడా ధాన్యం డబ్బులు సరిపోవడం లేదు. కష్టమే మిగిలింది. ఈ ఏడాది రబీలో వరిసాగుకు నీరు విడిచిపెట్టాలి.

-పీస కృష్ణ, చిన్నదూగాం, రైతు


పలాసలో వ్యాపారి కిడ్నాప్

(మూడో పేజీ తరువాయి)

మాధవి, వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని వేణుగోపాలరావు పసిగట్టాడు. వ్యవహారం పెద్దదవుతుందని భావించి వీఎల్ఎన్ రాజుతో ఆయన భార్య మాధవికి ఫోన్ చేయించారు. తాను క్షేమంగా ఉన్నానని, సాయంత్రానికి తిరిగి వస్తానని చెప్పాలని బలవంతం చేయడంతో దాని ప్రకారమే ఫోన్ చేశాడు. అయితే ఇందులో మతలబు ఉందని భావించిన కాశీబుగ్గ సీఐ వేణుగోపాలరావుకు ఫోన్ చేసి హెచ్చరించడంతో రిజిస్ట్రేషన్, కిడ్నాప్ డ్రామాకు ఫుల్‌స్టాప్ పడింది.

'ఉద్దానం' నీరు వృథా

పలాస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటి తాళభద్ర వద్ద ఉన్న ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నుంచి గురువారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ వృథాగా నీరు ఏరులై పారింది. ట్యాంకులో ఉన్న నీరంతా అయిపోయేవరకు ఇదే పరిస్థితి. ట్యాంకు కడిగినప్పుడు వినియోగించే హోల్ పాడయింది. దీంతో ట్యాంకులో నింపి నీటిని కుళాయల ద్వారా విడుదల చేయడానికి సిద్ధం చేశారు. ట్యాంకులోకి పంపించిన నీరు ఆ హోల్ నుంచి కిందకు దారలై ప్రవహించింది. దీంతో ఓ చిన్నపాటి కాలువలా తాగునీరు వృథాగా పోయింది.



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు (వృత్తంలో)



కాలువలా ప్రవహిస్తున్న తాగునీరు

విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం



ముఖ్యమంత్రితో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజన్ డాక్యుమెంట్-2047 లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో 'డేటా ఆధారిత పాలన' అనే అంశంపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలనఅందించడమే లక్ష్యం కావాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలతో పని చేయాలన్నారు. గ్రామ సచివాలయాలను విజన్ యూనిట్లుగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశేషించి... నిర్ణయాలు వేగంగా తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో లక్ష్మణమూర్తి, సీపీఓ ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్-19 మహిళా క్రికెట్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియం, ఆర్ట్స్ కళాశాలలో గురువారం నుంచి జరుగుతున్న స్కూల్‌గేమ్స్ అండర్-19 మహిళా క్రికెట్ పోటీల్లో తూర్పుగోదావరి, అనంతపురం జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 10 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. తొలిరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టుపై తూర్పు గోదావరి, కడప జట్టుపై అనంతపురం జట్లు గెలిచి.. సెమీస్‌కు చేరుకున్నాయి. విజయనగరం- శ్రీకాకుళం, విశాఖపట్నం- పశ్చిమ గోదావరి జట్ల మధ్య శుక్రవారం ఉదయం క్వార్టర్ ఫైనల్స్ జరగాల్సి ఉంది. వీటిలో గెలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి.



జూదానికి దూరంగా ఉండండి

- డీఎస్పీ వివేకానంద



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జూదానికి... బహిరంగ మద్యపానానికి దూరంగా ఉండాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ బుధవారం వెల్లడించిన తీర్పును అనుసరించి పేకాటలో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులు శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పొట్టి శ్రీరాములు కూడలి వద్ద 'జూదం ఆడడం నేరం.. బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన నిషేధం' అనే ప్లకార్డులను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ జూదం, మద్యపానం వల్ల వ్యక్తిగత, కుటుంబ సామాజిక జీవితాలు దెబ్బతింటాయని అన్నారు. కోర్టు తీర్పులో భాగంగా వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనా కార్య క్రమం నిర్వహించామన్నారు. సామాజిక సేవలో భాగంగానే వారు ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు జూదం, మద్యపానానికి దూరంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు కె.పైడిపునాయుడు, పి.ఈశ్వరరావు, నాగరాజు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధికి ప్రణాళికలు

- వంశధార ఎస్ఈ రామచంద్రరావు



ఎల్‌కేపల్లి వద్ద కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ

సరుబుజ్జిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వంశధార సాగునీటి కాలువల ఆధునికీకరణ, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఎస్ఈ జి.రామచంద్రరావు తెలిపారు. గురువారం యరగాం, పురుషోత్తపురం, బైరి ఓపెన్ హెడ్ ఛానెల్‌ను ఎల్‌కేపల్లి వద్ద ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఓపెన్‌హెడ్ ఛానెల్ ఆధునికీకరించి... రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి ప్రతిపాదనలు రూపొందించినట్టు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ వీటి విషయమై చర్యలు తీసుకోవాలని తమకు ఆదేశించారని చెప్పారు. ఆయన సూచన మేరకు ఓపెన్ హెడ్ ఛానెల్‌ను పరిశీలించినట్టు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఎస్ఈ వెంట ఈఈ ఎం.మురళీమోహన్, డీఈ క్రాంతికుమార్, జేఈ శోభన్‌బాబు తదితరులు ఉన్నారు.



అలరించిన చిన్నారుల నృత్యాలు

ఇచ్ఛాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో స్థానిక వేంకటేశ్వర డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కథాకళి, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. నాట్య గురువు శృతిపట్నాయక్, అకాడమి అధ్యక్షులు చిన్నాగురుస్వామి ఆధ్వర్యంలో 30మంది చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భగా అకాడమి అధ్యక్షుడిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.



బాహుదా జలాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, భక్తులు

కాళీమాత విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ

కవిటి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కవిటిలోని కేఆర్‌కే రోడ్డులోనున్న కాళీమాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠకు గురువారం అంకురార్పణ చేశారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మహిళలంతా కలసి పూర్ణకలశాలతో బాహుదా నది వద్దకు చేరుకున్నారు. అక్కడ పూజలు చేసిన తర్వాత నది నీటిని పట్టుకొని ఆలయానికి చేరుకున్నారు. ఆలయం వద్ద శుక్రవారం విగ్రహాన్ని, ముఖద్వారాన్ని ప్రతిష్ఠించనున్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పొందూరు, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్‌రావు అన్నారు. పొందూరులో సర్పంచ్ రేగడి లక్ష్మి అధ్యక్షతన గురువారం జాతీయ ఉపాధి హామీ గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పైల శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో పి.సింహచలం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అండర్-19 రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో ఎం.ధనలక్ష్మి, జి.శైలజ, ఎస్.కార్తీక్, జి.బలరాం, సీహెచ్ తేజ ఉన్నారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు గురువారం అభినందించారు.

అసిరితల్లి పండుగను వైభవంగా నిర్వహించాలి: ఎమ్మెల్యే

అరసవల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి గ్రామదేవత అసిరితల్లి పండుగను అత్యంత వైభవంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. పండుగలను పురస్కరించుకుని గురువారం ఆయన అసిరితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానికంగా పర్యటించి అనుసంధానంగా ఉన్న రోడ్లను పరిశీలించారు. పాడైన రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని... ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎక్కడా పారిశుధ్య లోపం లేకుండా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, కాలువలను శుభ్రం చేయాలని అన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని, బయోటాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


అరసవల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సేంద్రియ ఉత్పత్తులే శ్రేయస్కరం


స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను మెరుగు పర్చుకోవడానికి సేంద్రియ ఉత్పత్తులు శ్రేయస్కరమని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తుల వాడకం ద్వారా ప్రజలు కూడా ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, డాక్టర్ చాపర సుధాకర్, ఎస్.మురళీధర్, సిమ్మ మాధవి, బోయిన సునీత, నాగళ్ల మురళీధర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సనపల అన్నాజీరావు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

ట్యాంకులు లేవు.. నీరు ఎలా అందిస్తారు?


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అవసరమైన ట్యాంకులు నిర్మించకుండా తాగునీటిని అందించే ఏర్పాట్లు చేయటం విడ్డూరంగా ఉందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో తాగునీటి అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో గురువారం సమీక్ష నిర్వహించారు. రెండు నియోజకవర్గాల్లో 535 ట్యాంకులు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారని... 300 వరకు ట్యాంకులు నిర్మించకుండా... ప్రాజెక్టుకు హిర మండలంలో సరిపోవడం లేదని ఈ నిధులను మళ్లించారని అధికారులు చెప్పారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 375 గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా నీరు అందించాల్సి ఉన్నా.. 70 ప్రాంతాలలో మాత్రమే పనులు జరిగాయని వివరించారు. దీనిపై అశోక్ స్పందిస్తూ నియోజకవర్గంలో 234 ట్యాంకులు నిర్మించాల్సి ఉన్నా... కేవలం 65 మాత్రమే పూర్తి చేశారన్నారు. జలజీవన్ నిధులతో పథకాన్ని మెరుగు పర్చేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. ఈ సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్దానం ప్రాజెక్టు, మెగా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే వాడుదాం

జి.సిగడాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే వాడుదామని మండల బీజేపీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాంలు అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటా స్వదేశీ... ప్రతి ఇంటా స్వదేశీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలో తయారుచేసిన, మనం తయారుచేసిన వస్తువులను వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, మండల ప్రధాన కార్యదర్శి ముద్దాడ త్రినాథరావు, నాయకులు పండూరి అప్పారావు, శంకర్, త్రినాథ, ముద్దాడ గౌరి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభి వృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే నడుకు దిటి ఈశ్వరరావు అన్నారు. ముద్దాడలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'నమస్తే ఎచ్చెర్ల' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఏడాది నారాయణపురం కుడి కాలువ ద్వారా శివారు గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగు నీరందించామని తెలి పారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీ ఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మండల టీడీపీ అధ్యక్షుడు బెండు మల్లేశ్వ రరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువ నేశ్వరరావు, కూటమి నేతలు గాలి వెంకటరెడ్డి, సంపతిరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... తోటపాలెం నుంచి కొత్తపేట మీదుగా అంబేడ్కర్‌నగర్ వరకు నాబార్డు నిధులు రూ.3 కోట్లతో నిర్మించనున్న పను లకు ఎమ్మెల్యే ఈశ్వ రరావు శంకుస్థాపన చేశారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో అపరాల విత్తనాలు

బూర్జ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల్లో రబీ సాగుకు అవసరమైన పెసలు, మినుములు, కట్టి జనుం, రాగులు, నువ్వుల విత్తనాలు రాయితీపై సరఫరా చేయనున్నట్టు వ్యవసాయాధికారి డి.ఉషారాణి తెలిపారు. మినుములు 15 క్వింటాళ్లు, పెసర 8 క్వింటాళ్లు, కట్టిజనుం 30 క్వింటాళ్లు, నువ్వులు మూడు క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

ఎచ్చెర్ల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో నివాసం ఉంటున్న మెళియాపుట్టి ఏఎస్ఐ బగాది అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.ఒక లక్ష చెక్కును జిల్లా పోలీసు అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు, కోశాధికారి భుజంగరావు గురువారం అందజేశారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు

ఇచ్ఛాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి పి.ఫరీష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక జ్ఞానభారతి పాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ. ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులను వరుసగా కె.వైష్ణవి, అక్బర్‌ఖాన్, ఎస్.సౌమ్య, గ్రీష్మిత చౌదరి గెలుచుకున్నారు. వీరికి న్యాయాధికారి ఫరీష్ కుమార్ బహుమతులు అందజేశారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

లావేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన మొక్క జొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తాళ్లవలసలో తుఫాన్‌తో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి... మద్దతు ధర ఇవ్వాలని కోరారు.

అంతా మా ఇష్టం

- రోడ్డు మధ్యలో వాహనాలు నిలిపి వ్యాపారులు లోడింగ్, అన్‌లోడింగ్
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నరసన్నపేటలో ట్రాఫిక్ ఇబ్బందులు


కాలేజీ రోడ్డులో భారీ వాహనాలతో తప్పని అవస్థలు

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొందరు వ్యాపారులు రోడ్డుమీద వ్యాపారులు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించినా అటు పోలీసులు గానీ ఇటు పంచాయతీ అధికారులు పట్టించుకునే దాఖలు కనిపించడం లేదు. పాతబస్టాండ్‌లో కంబకాయి జంక్షన్ సమీపంలో ఒక ఫ్రూట్స్ హోల్‌సేల్ వ్యాపారి ఉదయం 4 గంటలు నుండి 8 గంటలు వరకు రోడ్డుమీద వాహనాలు నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. ఏమని ఎవైరనా ప్రశ్నస్తే.. పోలీసులే చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు, మీరు ఎవరు అడగ డానికి అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కళాశాల రోడ్డులో అరటి, దుంపలు, ఉల్లి వ్యాపారులు లారీలను కాలేజీ రోడ్డులో నిలుపుదల చేసి అన్‌లోడింగ్ చేపడుతున్నారు. తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిన పట్టించుకునే నాథుడే లేరు. మరొవైపు నరసన్నపేట మెయిన్ రోడ్డు, కాలేజీ రోడ్డులో తోపుడు బండ్లు రోడ్డుమీదకు రాగా, వ్యాపారులు ముందుకు వచ్చి రోడ్డుమీద వ్యాపారాలు చేయడంతో మెయిన్ రోడ్డులో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పల్లిపేట జంక్షన్ నుంచి రోడ్డికిరువైపులా సత్యవరం జంక్షన్ వరకు ఇదే పరిస్థితి. పట్టణంలో ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుచున్నారు. ఈ విషయంపై సీఐ ఎం.శ్రీనివాసరావు వద్ద ప్రస్తవించగా.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు నోటీసులు జారీ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


పాతబస్టాండ్‌లో రోడ్డుపై వాహనాలు నిలిపి పండ్ల విక్రయాలు చేస్తున్న హోల్‌సేల్ వ్యాపారులు

విద్యుత్ స్తంభం పడి ఒకరి మృతి


రాము (ఫైల్)

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెల్లివలస గ్రామం వద్ద విద్యుత్ స్తంభాలు వేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు బాణాల రాము (37) అక్కడక్కడే మృతిచెందగా.. మరో వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. ఉర్లాం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ స్తంభాలు వేసేందుకు ట్రాక్టరుపై నుంచి దించే సమయంలో ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. దీంతో తోటి కార్మికుల చేతుల్లో ఉన్న స్తంభం జారిపోయి కిందన ఉన్న నడగాం గ్రామానికి చెందిన రాముపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అదే గ్రామానికి చెందిన జోగి రాంబాబు గాయాలతో బయటపడ్డారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ దుర్గాప్రసాద్.. రాము భార్య డిల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

కాశీబుగ్గ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ హరిజనవీధిలో సంభవించిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు కాలిపోయింది. కొత్తపల్లి లీలావతి ఇంట్లో నుంచి గురువారం మధ్యాహ్నం పొగలు వ్యాపించాయి. వార్డు ఇన్‌చార్జి పోతనాపల్లి హరిప్రసాద్, స్థానికుల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి కాలిపోయాయి. రిఫ్రిజిరేటర్‌తో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. కట్టుబట్టలతో మిగలడంతో లీలావతి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

నందిగాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొండతెంబూరు సమీపాన జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వంజంగి సీతమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. హెడ్‌కానిస్టేబుల్ ఎం.కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు.. సీతమ్మ తన అల్లుడ్ని సాగనంపేందుకు జాతీయరహదారికి వచ్చి, తిరిగి రహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న పార్సిల్ వ్యాన్ ఢీకొంది. ఈమె రెండుకాళ్లకు గాయాలయ్యాయి. గాయపడ్డ సీతమ్మను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. సీతమ్మ కుమార్తె శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు

కంచిలిలో వృద్ధుడికి..

కంచిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కంచిలి జాతీయ రహదారి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దాకరాపల్లి గ్రామానికి చెందిన బడాయి ధర్మారావు అనే వృద్ధుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మారావు తన స్వగ్రామం నుంచి పురుషోత్తపురం వెళ్లేందుకు జాతీయ రహదారిని కాలి నడకన దాటుతుండగా పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న టిప్పర్ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ధర్మారావు తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి బాధితుడిని సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు బడాయి భగీరథి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి..

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అరసవల్లి వద్ద బుధవారం ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అరసవల్లి కొయ్యానవీధికి చెందిన పల్లికల బాలకృష్ణారెడ్డి ద్విచక్ర వాహనంపై తన ఇంటికి వెళుతుండగా.. అరసవల్లి రోడ్డు నుంచి మిల్లు జంక్షన్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న సూరాడ తేజేశ్వరరావు ఢీకొన్నాడు. దీంతో బాలకృష్ణరెడ్డికి గాయాలయ్యాయి. బాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తికి 30 రోజుల జైలు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిల్లు జంక్షన్ వద్ద బుధవారం బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ వచ్చి పోయే ప్రజలకు ఇబ్బంది కలిగించిన మండలవీధికి చెందిన కాగన గణేష్‌కి 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.శివరామకృష్ణ గురువారం తీర్పు చెప్పినట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

12 మంది బైండోవర్

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన కవిటి మండలానికి చెందిన 12 మందిని స్థానిక తహసీల్దార్ మురళీమోహన్ వద్ద బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మద్యం షాపుల్లో విక్రయాలు చేపట్టాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా అమ్మకాలను, కల్తీ మద్యాన్ని గుర్తించినా, ఎంఆర్‌పీ ధరలకంటే ఎక్కువకు విక్రయించినా వెంటనే 14405 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం


అధ్యక్షుడ్ని అభినందిస్తున్న దృశ్యం

టెక్కలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల లారీ యజమానుల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శంకరరావు, గౌరవాధ్యక్షుడిగా కోళ్ల వసంతకుమార్, ఉపాధ్యక్షుడిగా డి.రమణ, కార్యదర్శిగా ఎల్.బాలరాజు, సహాయ కార్యదర్శిగా త్యాగరాజు, కోశాధికారిగా పి.మాధవరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తుఫాన్ బాధితులకు నూనె, చక్కెర అందజేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పోలాకి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ప్రభుత్వం ఉచితంగా నిత్యావసర సరుకులు మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తుంది. ఈ క్రమంలో రాజారాంపురం గ్రామంలోని మత్స్యకార కుటుంబాలకు నూనె, చక్కెర అందడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ పి.శ్రీనివాసరావు స్పందించారు. దీంతో బాధిత కుటుంబాలను ఆర్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో వెళ్లి చక్కెర, నూనె మత్స్యకారులకు అందజేశారు.

విజేతలకు బహుమతులు


విజేతలతో న్యాయాధికారి మాధురి

పలాస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవా దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవా సంఘం గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు కోర్టు ఆవరణలో బహుమతులు న్యాయాధికారి యు.మాధురి అందించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు ఫయ్యాజ్‌అహ్మద్, ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై శిక్షణ

హిరమండలం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులకు వృత్తివిద్యపై శిక్షణ గురువారం నిర్వహించారు. ఓజేటీ ద్వారా విద్యార్థులకు వృత్తి పరమైన నైపుణ్యాలను, కొత్త సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చని ప్రిన్సిపాల్ అప్పల రాము అన్నారు.

తొక్కిసలాటలో గాయపడినవారికి పరిహారం అందజేత

వజ్రపుకొత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ శ్రీవేంకటేశ్వరస్వామి (చిన్నతిరుపతి) ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసటలో గాయపడిన వారికి మంజూరైన పరిహారాన్ని గురువారం తహసీల్దార్ సీతారామయ్య, టీడీపీ నాయకులు అందించారు. శివరాంపురం గ్రామానికి చెందిన దట్టి ఆదమ్మ, సీతాపురం గ్రామానికి చెందిన దుంప భారతిలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున్న చెక్కులను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సూరాడ మోహనరావు, కర్ని రమణ, మాజీ ఎంపీపీ గొరకల వసంతరావు, పీఏసీఎస్ చైర్మన్ కణితి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- టెక్కలి రూరల్: మండలంలో గల బూరగాం పంచాయతీ రామేశ్వరం గ్రామానికి చెందిన ఏదూరి చిన్నమ్మి మృతి చెందగా పిన్నింటి సూరమ్మ, గౌరి గాయపడ్డారు. వీరికిపరిహారంగా ప్రభుత్వం రూ.లక్ష చొప్పున్న ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బాధితులకు చెక్కులు అందజేశారు. కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరావు, టీడీపీ నాయకులు గణపతిరావు, దమయంతి, ప్రసాద్‌రెడ్డి, మాధవరావు,సంజీవ్, రూపవతి పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: చెక్కు అందిస్తున్న అధికారులు, నాయకులు


టెక్కలి రూరల్: చెక్కు అందిస్తున్న కూటమి నాయకులు

పోటీతత్వం పెంపొందించేందుకు దోహదం


పోటీలను పరిశీలిస్తున్న న్యాయాధికారి రాణి

కొత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యాసరచన పోటీలు విద్యార్థుల పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని కొత్తూరు కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రాణి అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఆమె పరిశీలించి పలు సూచనలు అందించారు. ఈనెల 9వ తేదీన జరగనున్న జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురష్కరించుకొని వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎగోవిందరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నౌపడా-మెళియాపుట్టి (ఎన్ఎం) రోడ్డు అంబేడ్కర్ జంక్షన్ పరిధిలో ఆక్రమణలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు ఆందోళన చేయడంతో ఆర్డీవో స్పందించి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న పలు దుకాణాలను పరిశీలించారు. రోడ్డు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటా మన్నారు. రోడ్లపై నీరుపోసినా, వాహనాలు నిలిపినా చర్యలు తప్పవన్నారు. ఈ దిశగా డీటీ రవికుమార్, ఎంపీడీవో రేణుకాదేవిని ఆదేశించారు. ఈయనతో పాటు చిట్టిబారికి లింగరాజు ఉన్నారు.

పేదలకు అండగా నిలవాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయి భక్తులు పేదలకు, అభాగ్యులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. సత్యసాయి బాబా శతజయంతుత్సవాల్లో భాగంగా మారుతీనగర్ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, మాజీ సర్పంచ్ ఉణ్న రాజశ్రీ, నాయకులు గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

జలుమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించి క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించాలని డీఈవో ఎ.రవిబాబు అన్నారు. ప్రభుత్వ బాలురు ఉన్నతపాఠశాల, కరవంజ ఆదర్శపాఠశాలను గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10వ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, కరవంజ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

మెళియాపుట్టి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బందపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలు విద్యార్థులతో కాళ్లు నొక్కించుకున్నా ఘటనపై మరోసారి విచారణ చేయాలన్నారు. సోషల్ మీడియాల్లో వచ్చిన ఫొటోల ఆధారంగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. వెంటనే ఆమెపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు.

చెక్‌డ్యామ్‌లు నిర్మించుకోవాలి

కోటబొమ్మాళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలాలు పెంపొందించుకునేందుకు చెక్‌డ్యామ్‌లు నిర్మించుకోవాలని ఏజీ పీడీ రమేష్, జియాలాజిస్ట్ అప్పలనాయుడు అన్నారు. గురువారం కొత్లపల్లి, కోటబొమ్మాళి గ్రామాల్లో చెరువులు, కొండవాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూగర్భ జలాలను 3 నుంచి 8 మీటర్లు పెరిగేలా రీచార్జ్ స్ట్రక్చర్స్ గుర్తించి చెక్‌డ్యామ్ నిర్మాణాలను చేపట్టేందుకు అందుకు తగ్గ ప్రదేశాలు గుర్తిస్తున్నట్టు తెలిపారు. వంశధార ఏఈ డి.లోకేష్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జి.హరిప్రసాద్, సిబ్బంది టి.రాంబాబు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్నీకాయిట్ పోటీలకు పయనం

పలాస, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో ఈ నెల 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న అంతర్‌జిల్లాల టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్టు గురువారం బయలుదేరి వెళ్లింది. స్థానిక ప్రభుత్వ క్రీడామైదానం వద్ద క్రీడాకారులకు దుస్తులు పంపిణీ, పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొమ్మాళి రోహిణి క్రీడాకారులకు దుస్తులు వితరణ చేశారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి సుడియా వెంకట జోగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.తవిటయ్య, మేనేజర్లు బి.తిరుమల రావు, బి.మహేష్, ఎల్.దిలీప్ పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

జలుమూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఈనెల 9న నిర్వహించనున్న బాలియాత్రకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు ఆదేశించారు. శ్రీముఖలింగం వద్ద వంశధార నది ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలియాత్రకు వచ్చే భక్తులు వంశధార నదిలో తెప్పలు వదలి దీపోత్సవం చేయడానికి ఎటువంటి సమస్యలు లేకుండా నదీతీరంలో ప్రదేశాన్ని చదునుచేసి ఏర్పాట్లు చేయాలని సర్పంచ్ టి.సతీష్ కుమార్‌కి సూచించారు. ఉచితంగా అరటితెప్పలు, వత్తెలు, నూనె అందిస్తామన్నారు. పక్కాగా ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు. నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, జలుమూరు ఎస్ఐ బి.అశోక్ బాబు, తహసీల్దార్ జె.రామారావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌ను కలిసిన నాయకులు

కొత్తూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీకి చెందిన సుడా చైర్మన్ కొరికాన రవికుమార్‌ను మండలానికి చెందిన వైసీపీ నాయకులు సారిపిల్లి ప్రసాదరావు, మరికొంతమంది నాయకులు శ్రీకాకుళంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పాతపట్నం నియోజవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు సుడా చైర్మన్ తెలిపారు.

- మెళియాపుట్టి: వసుంధర సర్పంచ్ సలాన అప్పలనాయుడు గురువారం సుడా చైర్మన్ కె.రవికూమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ బలోపేతం చేసేందుకు తమంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.భవాజీ, ఏఎంసీ డైరెక్టర్ ప్రశాంత్, దుక్క బాలరాజు, రామ్మూర్తి, కిరణ్, చంటి, హరి, మధు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

సర్దార్ పటేల్‌కి ఘన నివాళి

ఒడిశా


మాట్లాడుతున్న కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సాధనలో సర్దార్ పాత్ర మరువలేనిదని కలెక్టర్ మధుమిత అన్నారు. తన కార్యాలయంలో గురువారం కలెక్టర్ మధుమిత అధ్యక్షతన సర్దార్ వల్లభబాయ్‌పటేల్ జయంతి నిర్వహించారు. ఈ నెల 8న జిల్లాలోని విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా కార్యనిర్వహణ అధికారి శంకర కర్కట, డిప్యూటీ కలెక్టర్ అనుప్‌పండా, పృధ్వీరాజ్ మండల్, జిల్లా వైద్యాధికారి మహ్మద్‌ఆలీ ఉన్నారు.

దివ్యాంగుల సాధికారిత శిబిరం


శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

పర్లాకిమిడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్‌హాల్‌లో గురువారం బీమ్‌బోయి దివ్యాంగుల సాధికారిత శిబిరం నిర్వహించారు. పర్లాకిమిడి మున్సిపాలిటీ, జిల్లా సామాజిక స్వశాస్తీకరణ విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగుల పేర్లను నమోదు చేసుకున్నారు. 219మంది వికలాంగులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నిర్మలా శెట్టి, వైస్ చైర్మన్ మధు, ఎస్ఎస్‌పీడీ లక్కోజు సంతోష్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం


బాధితులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ తొక్కిసలాటలో గాయపడిన వారిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం పరామర్శించారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితురాలు కళావతిని కలెక్టర్ పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.హేమంత్, డాక్టర్ లక్ష్మీ లలిత, డాక్టర్ సురేష్, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ● కాశీబుగ్గ బాధితులకు మెరుగైన వైద్య సాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. గురువారం శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలులోని జెమ్స్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. కాశీబుగ్గ తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

తాగునీటి బోరుకు భూమిపూజ

సంతబొమ్మాళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మరువాడ పంచాయతీలో కొత్తమ్మతల్లి ఆలయం వద్ద, బీసీ కాలనీలో రెండు తాగునీరు బోర్లు ఏర్పాటుకు గురువారం సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ బాయ్స్ కళాశాల వసతిగృహంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పక్షుల కేంద్రం పరిశీలన

ఇచ్ఛాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తేలుకుంచివలస పక్షుల కేంద్రాన్ని జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ గురువారం పరిశీలించారు. అక్కడ ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. పక్షుల రక్షణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని.. చెట్ల కింద వలలు ఏర్పాటు చేయకపోవడంతో ఏటా పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ డి.సూర్యనారాయణ సీఈఓకు తెలిపారు. వాచ్‌టవర్ ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఎల్ఎన్ పేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహ కుమార్ తెలిపారు. సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలు తొలగించడంతోపాటు మరమ్మతు పనులు చేయనున్నట్టు తెలిపారు. .

నందిగాం పరిధిలో రేపు..

నందిగాం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో మదనాపురం, నందిగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు టెక్కలి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ నర్సింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ నిర్వహణ, చెట్టుకొమ్మల తొలగింపు దృష్ట్యా ఆ రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మదనాపురం, దీనబంధుపురం, దిమ్మిడిజోల, బెనియాపూరు, నవరకొత్తూరు, కల్లాడ, భర్తుపురం, హర్షబాడ, శారదాపురం, వెంకటాపురం, నందిగాంతో పాటు ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు సరఫరా ఉండదన్నారు.

- సోంపేట: బుషాభద్ర ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. మాకన్నపురం, పొత్రఖండ, బాతుపురం, హంసమెుర, ఎంజీపురం, బకుడా, గొరుడుగండి, చిన్నకోష్ట, పెద్దకోష్ట, అంబటి కంబారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుందాం

కోటబొమ్మాళి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయకుండా కోటి సంతకాలతో ఆపుదామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరణకు నిరసిస్తూ గురువారం మండలంలో గల మూ సాహెబ్ పేట, తాటిపర్తి, నీలంపేట పంచాయతీల్లో టెక్కలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో జరిగిన రచ్చబండ, కోటి సంతకాలు స్వీకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు.



